క్లుప్తంగా

బీరప్ప స్వామి దేవాలయానికి విరాళం



రూ.50 వేలను విరాళంగా అందిస్తున్న దాతలు

కర్నూలు(అర్బన్): జిల్లా కురువ సంఘం ఆధ్వర్యంలో స్థానిక పెద్దపాడు రోడ్డులోని ఆదర్శ పాఠశాల సమీపంలో నిర్మిస్తున్న బీరప్ప స్వామి దేవాలయానికి శనివారం నగరానికి చెందిన కె. వెంకటరమణ , కె. శ్రీనివాసులు రూ.25 వేలు చొప్పున విరాళం అందించినట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగ స్వామి తెలిపారు. అందరి సహకారంతో బీరప్ప స్వామి దేవాలయాన్ని సర్వాంగసుందరంగా అన్ని వసతులతో నిర్మిస్తున్నామన్నారు. దేవాలయ నిర్మాణంతో పాటు కమ్యూనిటీ హాల్, విద్యార్థులకు హాస్టల్ నిర్మాణాలకు దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో కోశాధికారి కేసీ నాగన్న తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీలో రాణించాలి



క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేసిన అసోసియేషన్ నాయకులు రాజశేఖర్

కర్నూలు (టౌన్): కబడ్డీ క్రీడలో రాణించాలని కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు రాజశేఖర్, విద్యాసాగర్ అన్నారు. శనివారం స్థానిక జొహరాపురంలో కబడ్డీ వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కబడ్డీ క్రీడాకారులకు క్రీడా దుస్తులు అందజేశారు. వారు మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరంలో నేర్చుకున్న మెలకువలను శిక్షణ అనంతరం ప్రతి రోజు సాధన చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, ఆనంద్, మురళీ, సోలోమోన్, ఓబులేష్ పాల్గొన్నారు.

సిద్ధేశ్వరం అలుగు నిర్మించాలి



పోస్టర్లు విడుదల చేస్తున్న సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు

కర్నూలు(సెంట్రల్): సిద్ధేశ్వరం అలుగు నిర్మించాలని కోరుతూ ఈనెల 31వ తేదీన సంగమేశ్వరం దగ్గర నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి వెంకటస్వామి పిలుపునిచ్చారు. శనివారం కర్నూలులోని గోకార్ భవన్‌లో బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాయలసీమ ప్రాంతానికి తాగు, సాగునీటిని ఇచ్చే సిద్ధేశ్వరం అలుగు చేపట్టాలని డిమాండ్ చేశారు. దాదాపు 85 ఏళ్లుగా రైతులు, సాగునీటి రంగ నిపుణులు డిమాండ్ చేస్తున్నా పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు శేషని, భాస్కర్ పాల్గొన్నారు.

ఆదివాసులను కాల్చిచంపడం అన్యాయం



కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): తీవ్రవాదుల పేరుతో అమాయకులైన ఆదివాసులను కాల్చి చంపడం అన్యాయమని ప్రజాస్వామ్య సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ బస్తిపాటి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ ఎదుట ప్రజాస్వామ్య సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆపరేషన కగార్‌ను వెంటనే రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సీపీఐ మావోయిస్టు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతోపాటు మరో 26 మందిని చంపడం అన్యాయమన్నారు. దీనిపై న్యాయ విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత హక్కులనేత మహేష్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎండీయూ వాహనాలను కొనసాగించాలి



మాట్లాడుతున్న గౌస్‌దేశాయ్

కర్నూలు(సెంట్రల్): రేషన్ సరుకుల డోర్ డెలివరీ కోసం తీసుకొచ్చిన ఎండీయూ వాహనాలను కొనసాగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. ఆ వాహనాలను తొలగిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేదంటే ఆపరేటర్లకు అండగా సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. శనివారం కార్మిక, కర్షక భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అర్ధాంతరంగా వాహనాలను తొలగిస్తే ఎండీయూ ఆపరేటర్లు ఈఎంఐలు ఏ విధంగా చెల్లించాలని ప్రశ్నించారు. నాయకులు రాధాకృష్ణ, రాముడు, ప్రభాకర్ పాల్గొన్నారు.

వామ్మో..థైరాయిడ్

- ప్రతి పది మందిలో ఒకరికి థైరాయిడ్ వ్యాధి
- కీళ్లనొప్పులు, డిప్రెషన్, ఊబకాయ సమస్యలు
- జీవితం నిస్సారమైన భావన
- మందులు, వ్యాయామంతో నియంత్రణ
- జిల్లాలో 13 శాతం మంది బాధితులు
- నేడు వరల్డ్ థైరాయిడ్ డే

కర్నూలు(హాస్పిటల్): కొద్దిరోజులుగా ఊబకాయం రావడం లేదా సన్నబడటం, కొద్దిగా పనిచేసినా నిస్సత్తువ ఆవహించడం, చిన్న విషయాలకే కోపం రావడం, ముఖం ఉబ్బుగా కనిపించడం, చర్మం పొడిబారడం, కీళ్ల నొప్పులు వేధించడం వంటి లక్షణాలు ఏమైనా మీలో కనిపిస్తే ఓసారి పరీక్షించుకోండి. ఎందుకంటే ఇటీవల ప్రతి పది మందిలో ఒకరికి థైరాయిడ్ వ్యాధి వేధిస్తోంది. దీనిని నిర్లక్ష్యం చేస్తే దీర్ఘకాలిక సమస్యగా మారి శరీరాన్ని ఛిద్రం చేస్తుంది. ఈ గ్రంథి పనిచేయకపోతే దేహంలోని ఇతర అవయవాల పనితీరు మందగిస్తుంది. ఈ నెల 25వ తేదిన ‘వరల్డ్ థైరాయిడ్ డే’ సందర్భంగా ప్రత్యేక కథనం.

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఎండోక్రైనాలజి విభాగంలో హార్మోన్‌లకు సంబంధించిన వ్యాధులకు చికిత్స చేస్తారు. ఏవైనా హార్మోన్‌లలో హెచ్చుతగ్గులు వచ్చినా, తద్వారా ఏర్పడే సమస్యలు, ఇబ్బందులను గమనించి ఇక్కడ చికిత్స అందిస్తారు. హార్మోన్‌లలో థైరాయిడ్ కూడా ఒకటి. ఈ హార్మోన్ విడుదలలో హెచ్చుతగ్గులు వస్తే దానిని థైరాయిడ్ వ్యాధిగా పరిగణిస్తారు. ఎండోక్రైనాలజి విభాగంలో ప్రతి మంగళ, శుక్రవారాల్లో ఓపీ చికిత్స ఉంటుంది. ఈ ఓపీకి థైరాయిడ్ సమస్యతో ప్రతి నెలా 700 నుంచి 800 మంది చికిత్స కోసం వస్తారు. ఇందులో 500 నుంచి 600 మంది హైపో థైరాయిడిజం, 200 మంది హైపర్ థైరాయిడిజంతో బాధపడుతున్న వారున్నారు. ప్రైవేటు వైద్యుల వద్దకు సైతం ప్రతిరోజూ వంద నుంచి 150 మంది దాకా థైరాయిడ్ బాధితులు చికిత్స తీసుకుంటున్నారు. ఈ మేరకు వారి వద్దకు సగటున నెలకు 2 వేల మందికి పైగా చికిత్స పొందుతున్నారు. మొత్తం థైరాయిడ్ రోగుల్లో 80 శాతం మంది హైపో థైరాయిడ్, 20 శాతం మంది హైపర్ థైరాయిడ్ బాధితులు ఉంటున్నారు. వీరిలో కొందరికి గాయిటర్ (గొంతు వద్ద గడ్డ) ఉంటోంది. ఇలా కణితి ఉన్న ప్రతి ఒక్కరికీ ఆపరేషన్ అవసరం లేదు. క్యాన్సర్‌గా మారితేనే ఆపరేషన్ చేయించుకోవాలి. గడ్డలు ఏర్పడ్డ వారిలో 5 శాతం మందిలో మాత్రమే క్యాన్సర్ కణితిలు ఉంటాయి. వీరికి మాత్రమే ఆపరేషన్ చేసి కణితి తొలగించాల్సి ఉంటుంది.

గర్భిణిల్లో ఇబ్బందులు...

కొందరు గర్భిణిలకు గర్భం దాల్చిన సమయంలో థైరాయిడ్ సమస్య ఉత్పన్నమవుతుంది. వారిలో ఈ సమస్యను ముందుగానే గుర్తించకపోతే, పుట్టే పిల్లల్లో మేధోపరమైన లోపాలు ఉండవచ్చు. గర్భం దాల్చిన సమయంలో ఈ సమస్యను గుర్తించకపోతే పిల్లల ఎదుగుదల శారీరకంగానే కాదు మానసికంగానూ మందగించే ప్రమాదం ఉంది. కాబట్టి థైరాయిడ్ సమస్యను ఆలస్యం చేయకుండా గుర్తించి దానికి సరైన చికిత్స తీసుకోవడం చాలా ముఖ్యం.



అస్తవ్యస్త జీవనశైలి వల్లే!

సరైన ఆహారపు అలవాట్లు, జీవనశైలి సరిగ్గా లేకపోవడం వల్ల హార్మోన్లు అసమతుల్యం అవుతాయి. తద్వారా థైరాయిడ్ వ్యాధి వస్తుంది. ఇది మందులతో పాటు సరైన ఆహారం తీసుకోవడం వల్ల ఈ సమస్యను నియంత్రించవచ్చు. దీంతో పాటు జీవనశైలిలోనూ మార్పులు చేసుకోవాలి. మహిళల్లో థైరాయిడ్ సరిగ్గా పనిచేయకపోతే రుతుక్రమం సమయానికి రాకుండా గర్భం దాల్చే అవకాశం తగ్గుతుంది. కాబట్టి థైరాయిడ్ సమస్యలకు తగిన చికిత్స చేయించుకున్నట్లయితే ఈ సమస్యల నుంచి దూరంగా ఉండవచ్చు. థైరాయిడ్‌ను అదుపులో ఉంచుకునేందుకు కనీసం ఆరు నెలలకు ఒకసారి వైద్యపరీక్షలు చేయించుకోవాలి.

13 శాతం మందిలో థైరాయిడ్ సమస్య



సమాజంలో 11 శాతం మందిలో హైపోథైరాయిడ్, రెండు శాతం మందిలో హైపర్ థైరాయిడ్ సమస్య ఉంది. ఈ సమస్యను త్వరగా గుర్తిస్తే తద్వారా కలిగే ఇబ్బందులు రాకుండా చేయవచ్చు. అయోడిన్ లోపం కారణంగా ఈ వ్యాధి వస్తోంది. ఈ వ్యాధి ఉన్న వారు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటూ క్రమం తప్పకుండా మందులు వాడుతూ ఉంటే ఏమీ కాదు. హైపోథైరాయిడిజం ఉన్న వారు నార్మల్‌గా ఉన్నా ప్రతి ఆరు నెలలకు ఒకసారి థైరాయిడ్ పరీక్ష చేయించుకుంటూ ఉండాలి. హైపర్ థైరాయిడిజం ఉన్న వారు మూడు నెలలకు ఒకసారి చేయించుకోవాలి. –డాక్టర్ పి. శ్రీనివాసులు, ఎండోక్రైనాలజి విభాగాధిపతి, జీజీహెచ్, కర్నూలు

గర్భిణుల్లో థైరాయిడ్ ఉంటే జాగ్రత్త



గర్భిణిల్లో థైరాయిడ్ సమస్య ఉన్నట్లు గుర్తిస్తే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ మేరకు గర్భం దాల్చిన ప్రతి మహిళకు మేము థైరాయిడ్ పరీక్ష చేయిస్తాము. పరీక్షలో థైరాయిడ్ సమస్య ఉన్నట్లు నిర్ధారణ అయితే వైద్యుల సూచనలు పాటిస్తూ మందులు వాడాలి. ప్రస వం తర్వాత కూడా పరీక్ష చేయించుకుని మందులు వాడాలి. గర్భిణిలకు ఇది వరకే థైరాయిడ్ ఉండి మందులు వాడకపోతే పుట్టబోయే బిడ్డకు ఈ జబ్బు వస్తుంది. ప్రసవం అయిన వెంటనే బిడ్డకు కూడా పరీక్ష చేయించాలి. థైరాయిడ్ ఉందంటే మందులు వాడాలి. లేకపోతే బుద్ధి మాంద్యం వస్తుంది. –డాక్టర్ టి.జ్యోత్స్న, గైనకాలజిస్టు, కర్నూలు

పొగాకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోండి

కర్నూలు(అగ్రికల్చర్): ‘ఐటీసీ కంపెనీ మాటలు విని మేము పెద్ద ఎత్తున పొగాకు సాగు చేశాం. తీరా పంట చేతికి వచ్చిన తర్వాత పొగాకు కొనుగోలులో సదరు కంపెనీ నిర్లక్ష్యం వహిస్తోంది. మీరు చొరవ తీసుకొని పొగాకు కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాల’ని కర్నూలు మండలం ఉల్చాల గ్రామానికి చెందిన రైతులు జాయింట్ కలెక్టర్ నవ్యను కోరారు. శనివారం ఉల్చాల గ్రామానికి చెందిన దాదాపు 60 మంది రైతులు పొగాకు కొనుగోలు విషయమై జేసీని కలిశారు. గ్రామంలో పరపతి ఉన్న రైతుల నుంచి పొగాకు పూర్తిగా కొనుగోలు చేసిన ఐటీసీ సాధారణ రైతుల వద్ద పొగాకు కొనుగోలులో నిర్లక్ష్యం చేస్తోందని జేసీ ఎదుట రైతులు వాపోయారు. వందలాది మంది రైతుల నుంచి ఇప్పటి వరకు కనీసం ఒక్క క్వింటాలు కూడా కొనుగోలు చేయలేదని పేర్కొన్నారు. మీరే న్యాయం చేయాలని జేసీని కోరారు. ఇందుకు ఆమె స్పందిస్తూ.. గ్రామంలో ఏ రైతు దగ్గర ఎన్ని క్వింటాళ్ల పొగాకు ఉందనే దానిపై లిస్ట్ తయారు చేయండి... దానిని ఐటీసీ కంపెనీ ప్రతినిధులకు పంపి కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

27న సీపీఐ జిల్లా సమితి సమావేశం

కర్నూలు(సెంట్రల్): సీపీఐ జిల్లా సమితి సమావేశాన్ని ఈనెల 27న సీఆర్ భవన్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ, కార్యవర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య హాజరు కానున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చి సంవత్సరం అయినప్పటికీ సాగునీటి ప్రాజెక్టులు, సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయకుండా నిర్లక్ష్యం చేయడంపై చర్చించనున్నట్లు చెప్పారు.

బాబుది పిచ్చి తుగ్లక్ పాలన

- రాజధాని నిర్మాణం పేరుతో ప్రజా ధనం వృథా
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్ ధ్వజం



మద్దూరు సుభాష్ చంద్రబోస్

కర్నూలు (టౌన్): జనవాసాలు లేని ప్రాంతంలో రూ. లక్ష కోట్లు అప్పు చేసి రాజధాని నిర్మాణం చేపట్టడం సరికాదని, ప్రస్తుతం బాబు పాలన పిచ్చి తుగ్లక్‌కు తలపిస్తుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్ విమర్శించారు. శనివారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎక్కడైనా సరే క్రమంగా రాజధాని అభివృద్ధి చేసుకోవడం జరుగుతుందన్నారు. అమరావతిలో మాత్రం ఒకేసారి అన్ని భవనాలు నిర్మించి ప్రజాధనం వృథా చేస్తున్నారన్నారు. 2019కు ముందు కూడా తాత్కాలిక భవనాల పేరుతో వేల కోట్లు ఖర్చు చేశారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన ప్రతిసారి లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేసి ఆ భారం ప్రజలపై మోపుతున్నారని మండిపడ్డారు. ప్రజా సంక్షేమాన్ని చంద్రబాబు సర్కారు గాలికి వదిలేసిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించలేదన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేయలేదన్నారు. అన్ని వర్గాల ప్రజలు బాబు పాలనను గమనిస్తున్నారని తగిన సమయంలో వారే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

నేడు ఇస్కాన్‌లో మామిడి పండ్ల ఉత్సవం

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో ఆదివారం మామిడి పండ్ల ఉత్సవం నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక ప్రభు తెలిపారు. శ్రీ జగన్నాథ్ స్వామివారికి నిర్వహించే మామిడి పండ్ల ఉత్సవంలో భక్తులందరూ పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఉపాధ్యాయ బదిలీల దరఖాస్తు గడువు పెంచాలి



డీఈఓ శామ్యూల్ పాల్‌కు వినతి పత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

కర్నూలు సిటీ: ఉపాధ్యాయుల బదిలీలకు దరఖాస్తు చేసుకునేందుకు పలు సమస్యలు తలెత్తుతున్నాయని, ఈ నేపథ్యంలో విద్యాశాఖ అధికారులు గడువు పెంచాలని యూటీఎఫ్ నాయకులు డీఈఓ ఎస్. శ్యామూల్ పాల్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉల్చాల రవికుమార్, నవీన్ పాటి మాట్లాడుతూ వితంతు, లీగల్లీ సపరేట్‌గా ఉన్న వారికి స్పెషల్ పాయింట్లు ప్రివ్యూలో కనబడుతున్నాయని, అయితే దరఖాస్తుసబ్మిట్ చేసిన తరువాత కనబడటం లేదని దీని సరి చేయాలన్నారు. ఎస్జీటీగా పని చేసి పై అధికారుల అనుమతితో డీఎస్సీ రాసి స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికైన వారికి ఎస్జీటీ సర్వీస్ పాయింట్లు ఇవ్వాలన్నారు. అవివాహిత మహిళలకు 40 ఏళ్ల నిబంధనను తొలగించాలన్నారు. రేషనలైజేషన్‌కు గురైన స్కూల్ అసిస్టెంట్లకు ఓల్డ్ స్టేషన్ పాయింట్స్ ఇవ్వాలన్నారు. డీఈఓకు వినతి పత్రం ఇచ్చిన వారిలో యూటీఎఫ్ నాయకులు తిమ్మన్న, హనుమంతు, సోమన్న, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కర్నూలు (టౌన్): యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని జాయింట్ కలెక్టర్ నవ్య అన్నారు. శనివారం స్థానిక ఇండోర్ స్టేడియంలో యోగాంధ్ర-2025 యోగ సాధన, అవగాహన మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ వచ్చే నెలలో విశాఖపట్నంలో నిర్వహించనున్న అంతర్జాతీయ యోగ దినోత్సవంలో 2 కోట్ల మంది యోగ నేర్చుకొని ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు చెప్పారు. మండల స్థాయిలో ట్రైనర్లకు శిక్షణ ఇచ్చేందుకు ఇండోర్ స్టేడియం, ఔట్ డోర్ స్టేడియంలో 256 మంది మాస్టర్ ట్రైనర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఈఓ శామ్యూల్ పాల్, సెట్కూర్ సీఈఓ డాక్టర్ వేణుగోపాల్, డీఎస్‌డీఓ భూపతిరావు, యోగా సంఘం కార్యదర్శి అవినాష్ పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతత

నేటి యాంత్రిక యుగంలో యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్ర బాబు అన్నారు. శనివారం యోగా మాసోత్సవం పురస్కరించుకొని ఖానా- ఖాజానా వద్ద స్ట్రీట్ యోగా కార్యక్రమాన్ని కమిషనర్ ప్రారంభించి మాట్లాడారు. వచ్చే నెల 21 వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 6 గంటల నుండి 7 గంటల వరకు ప్రతి రోజు యోగా ఆసనాలపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. దీనిని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలన్నారు.

- యోగాంధ్రలో ప్రజలను భాగస్వామ్యం చేసేందుకు నిర్వహిస్తున్న సర్వేను వేగవంతం చేయాలని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్‌జీవీ క్రిష్ణ అన్నారు. శనివారం స్థానిక ఎస్‌బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో సచివాలయాల అడ్మిన్లతో సమావేశం నిర్వహించారు.

మానసిక ఒత్తిడి దూరం

కర్నూలు కల్చరల్: యోగాతో మానసిక ఒత్తిడి దూరమవుతుందని రాయలసీమ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ ఆచార్య వి. వెంకట బసవరావు అన్నారు. యోగాంధ్ర -2025 కార్యక్రమంలో భాగంగా వర్సిటీ ఇండోర్ స్టేడియంలో జరిగిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. యోగాను ప్రతి ఒక్కరు దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి. విజయకుమార్ నాయుడు, ప్రముఖ యోగా శిక్షకులు బి. శ్రీనివాసులు, వర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి.శివకిషోర్, వివిధ విభాగాల అధ్యాపకులు, బోధనేతర ఉద్యోగులు పాల్గొన్నారు.



ఇండోర్ స్టేడియంలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థిని



యోగా చేస్తున్న ఆర్‌యూ వీసీ వెంకట బసవరావు తదితరులు

స్మార్ట్ మీటర్లు వద్దు

కల్లూరు: ప్రస్తుతం ఉన్న పాత విద్యుత్ మీటర్లను అలాగే ఉంచాలని.. స్మార్ట్ మీటర్లు వద్దని సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యుడు కె. సుధాకరప్ప అన్నారు. శనివారం కల్లూరు అర్బన్ 33వ వార్డులో సీపీఎం నాయకులు యేసు, శ్రీనివాసులు, గోవిందు ఇంటింటికి తిరిగి స్టిక్కర్లు అతికించే కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యుత్ చార్జీలు విపరీతంగా పెంచి ప్రజలపై భారం మోపిందని టీడీపీ నాయకులు గతంలో ప్రచారం చేశారని గుర్తు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పి ఏడాదిలో ట్రూఆఫ్ పేరుతో రెండు సార్లు విద్యుత్ చార్జీలు పెంచారన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించడం ద్వారా నెలకు రూ. 3వేలు వచ్చే కరెంటు బిల్లు రూ.30వేల వరకు వస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామచంద్రుడు, లక్ష్మన్న, పెద్ద రమేష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలి

కర్నూలు(టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని కల్లూరుకు సంబంధించిన 16 వార్డుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి చెప్పారు. శనివారం స్థానిక ఎస్‌బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో మున్సిపల్ అధికారులు, సచివాలయాల సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఒక్కొక్క వార్డులో ప్రాధాన్యత క్రమంలో రూ.50 లక్షలతో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో కమిషనర్ రవీంద్రబాబు, అదనపు కమిషనర్ కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

టీకాలతో ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ



అవగాహన కల్పిస్తున్న డెమో శ్రీనివాసులు శెట్టి

కర్నూలు(హాస్పిటల్): టీకాలతో ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ కలుగుతుందని డెమో శ్రీనివాసులు శెట్టి చెప్పారు. శనివారం స్థానిక ఎర్రబురుజు యూపీహెచ్‌సీ పరిధిలోని 3వ సచివాలయం చిదంబరరావు వీధిలో వ్యాధి నిరోధక టీకాల ప్రాముఖ్యత, కిల్కారి మెసేజ్ విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డెమో శ్రీనివాసులు శెట్టి మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలకు, గర్భిణులకు సమయానుసారం ఇవ్వాల్సిన టీకాలను క్రమం తప్పకుండా ఇప్పించాలన్నారు. ఏ టీకా వేస్తున్నారు, ఏ జబ్బు రాకుండా నివారిస్తుందనే విషయాలను తల్లులకు ఆశాలు, ఆరోగ్య కార్యకర్తలు అవగాహన కల్పించాలన్నారు. ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే బిడ్డకు పట్టాలన్నారు. ఏడో నెల నుంచి శిశువుకు అనుబంధ ఆహారం తినిపించాలని చెప్పారు. మాతాశిశు ఆరోగ్య సేవలు బలోపేతం చేయడంలో భాగంగా కిల్కారి మెసేజ్ విధానం ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు నేషావతి, కవిత, రామేశ్వరి పాల్గొన్నారు.

ప్రతి నియోజకవర్గంలో స్టేడియం

- మంత్రి టీజీ భరత్ వెల్లడి



మునగాలపాడులో క్రికెట్ గ్రౌండ్ వివరాలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు (టౌన్): ప్రతి నియోజక వర్గంలో స్టేడియం ఏర్పాటు చేయాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అందులో భాగంగానే కర్నూలు నగరంలో క్రికెట్ స్టేడియం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. శనివారం నగర శివారులోని మునగాల పాడులో బాల సాయి బాబా స్కూల్ పక్కన ఉన్న ఏసీఏ గ్రౌండ్ విస్తీర్ణం, లెవలింగ్ పనులు, ఫెన్సింగ్ పనుల పురోగతి గురించి సంబంధిత అధికారులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ మాట్లాడుతూ గ్రౌండ్ ప్రణాళికను వచ్చే నెల 7 వ తేదీ నాటికి రూపొందించాలన్నారు. అనంతరం అభివృద్ధి పనులు ప్రారంభిస్తామన్నారు. జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ గ్రౌండ్‌ను రోవర్‌తో సర్వే చేయించి నివేదికను ఆదివారం నాటికి అందజేయాలని కర్నూలు మండల తహసీల్దార్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ కోశాధికారి దండుమూడి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, కర్నూలు ఆర్డీవో సందీప్, కర్నూలు మండల తహసీల్దార్ రమేష్‌బాబు, కర్నూలు జిల్లా క్రికెట్ అసోసియేషన్ పాలనాధికారి రమేష్ పాల్గొన్నారు.

సమ్మర్ స్టోరేజీ ట్యాంకు పరిశీలన

మునగాలపాడులోని సమ్మర్ స్టోరేజీ ట్యాంకును మంత్రి పరిశీలించారు. ట్యాంకుకు ఎదురుగా ఉన్న భూమి ఆక్రమణకు గురి కాకుండా చూసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఆ భూమిని ఎకో పార్కుగా అభివృద్ధి చేయాలని సూచించారు.

దాతల సహకారంతో డైనింగ్ హాల్

పాణ్యం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో దాతల సహకారంతో డైనింగ్‌హాల్ నిర్మాణం జరుగుతోంది. పాఠశాలలో దాదాపు 500 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరు మధ్యాహ్న భోజనం చేయాంటే డైనింగ్ హాల్ లేదు. దీంతో నేలపై కుర్చొని భోజనం చేయాల్సి వస్తోంది. ఈ విషయాన్ని గ్రహించిన దాతలు దాతృత్వం చాటుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ ఇక్బాల్ ఉసేన్, అలాగే ఏపీఆర్, ఎస్‌వీఆర్ ఇంజినీరింగ్ కళాశాల యజమాన్యంతో ఈ నిర్మాణం చేపడుతున్నారు. ప్రస్తుతం బండ పరుపు వరకు పూర్తి చేయగా త్వరలోనే షెడ్డు ఏర్పాటు చేసి విద్యార్థులు కుర్చొని తినేలా నిర్మాణాలు చేపడుతున్నట్లు ఎంఈఓ -2 సుబ్రమణ్యం తెలిపారు.

డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ పొందిన మోహన ప్రసాదరావు

కర్నూలు (సిటీ): శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం (ఎస్వీయూ) భూగర్భ శాస్త్రం (జియాలజీ) విభాగంలో విశిష్ట పరిశోధన చేసిన కర్నూలు మండలం భూపాల్‌నగర్‌కు చెందిన మోహన ప్రసాదరావుకు డాక్టరేట్ (పీహెచ్‌డీ) వచ్చింది. ప్రొఫెసర్ టి.మధు పర్యవేక్షణలో ఇంటిగ్రేటెడ్ హైడ్రోజియోలాజికల్ స్టడీస్ ఆఫ్ హంద్రీ రివర్ బేసిన్ యూజింగ్ జియోస్పేషిల్ టెక్నిక్స్, కర్నూలు జిల్లా అనే అంశంపై అధ్యయనానికి ఈ అవార్డు వచ్చినట్లు మోహన్‌ప్రసాదరావు తెలిపారు.

In the Court of the Principal Senior Civil Judge: Kurnool
I.P. 32/2025
Maddikera Venkateswarlu - Petitioner/Debtor
-Vs-
Golla Seenu & 17 Others - Respondents/Creditors
GENERAL NOTICE
పై అర్జీదారుడు తనను దివాలాదారునిగా తీర్మానించమని కోరుతూ పై కేసు దాఖలు చేసియున్నాడు. ఎవరికైనా ఎలాంటి అభ్యంతరాలు వున్నచో పై కోర్టు ఎదుట 7-7-2025వ తేదీ ఉదయం 10.30 గంటలకు హాజరై తెలుపుకొనేది.
(By Order of the Court)
T.Eswar Babu, Advocate, Kurnool. Cell: 94402 91045

గోవధ నిషేధ చట్టాన్ని పక్కాగా అమలు చేయాలి



డీటీసీ శాంతకుమారికి వినతిపత్రం సమర్పిస్తున్న వీహెచ్‌పీ ప్రతినిధి బృందం

కర్నూలు: గోవధ, అక్రమ రవాణా నిషేధ చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి ఈపూరి నాగరాజు డిమాండ్ చేశారు. రాబోయే బక్రీద్ పండుగను పురస్కరించుకుని జిల్లాలో గోవుల అక్రమ రవాణను అరికట్టాలని వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి ఈపూరి నాగరాజు ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం రవాణా శాఖ ఉప కమిషనర్ శాంతకుమారి, పలువురు పోలీసు అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. కర్నూలు డీఎస్పీతో పాటు వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్, ఫోర్త్ టౌన్, కర్నూలు అర్బన్ తాలూకా, రూరల్ తాలూకా పోలీస్ స్టేషన్లలో సీఐలకు ఈ మేరకు వారు వినతిపత్రం సమర్పించారు. అలాగే పశువైద్య అధికారి వసంత కుమార్, జిల్లా ఆహార భద్రత అధికారి రాజగోపాల్‌కు కూడా కలిసి విన్నవించారు. విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు టీసీ మద్దిలేటి, గోరక్ష జిల్లా ప్రముఖ్ బెస్త పరుశురాముడు, గోవింద రాజులు, జిల్లా ఉపాధ్యక్షుడు గూడూరు గిరిబాబు, జిల్లా సహాయ కార్యదర్శి నీలి నరసింహ, విభాగ్ విశేష సంపర్క ప్రముఖ్ తిమ్మారెడ్డి, సాయినాథ్, కరణం సుధాకర్, రాజేంద్ర ప్రసాద్, చైతన్య విశ్వహిందూ పరిషత్ బృంద సభ్యులు వివిధ శాఖల అధికారులను కలసి గోవధ చట్టాలను కఠినంగా అమలు చేయాలని వినతిపత్రాలు సమర్పించారు.

మతసామరస్యానికి ప్రతీక భారత్



నాటకంలో ఓ సన్నివేశం

కర్నూలు కల్చరల్: మతసామరస్యానికి ప్రతీక మన భారతదేశమని అని ఫర్‌మెన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరా శాంతి అన్నారు. శనివారం రాత్రి సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో జన వికాస్ సమితి ఆధ్వర్యంలో క్రైస్తవ భక్తి గీతాలాపన, ‘రక్త తర్పణం’ క్రైస్తవ నాటిక ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన పాటల పోటీల్లో విజేతలకు నగదు బహుమతులతో సత్కరించారు. టీజీవీ కళాక్షేత్ర అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ తాను ఒక క్రైస్తవ కళాశాలలో 30 సంవత్సరాలు పని చేయడం మరిచిపోలేనిదన్నారు. తాను రచించిన యేసు శతకం ఇప్పటికీ ఆదరణ పొందుతుందన్నారు. వినోద్ ఎంతో కష్టపడి రక్త తర్పణం నాటకం రూపొందించారన్నారు. కార్యక్రమంలో కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియ్యా, సభ్యులు పాల్గొన్నారు.